క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలపై అవగాహన

శావల్యాపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ తమవంతు సహకారం అందించాలని ఎస్సై చల్లా సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని వయ్యకల్లు గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండలంలోని అన్నీ గ్రామాల్లో పర్యటించి ఎన్నికల నిబంధనలపై ప్రజలకు తగు సూచనలు జాగ్రత్తలు తెలియజేస్తున్నామన్నారు. మండలంలోని కారుమంచి, వేల్పూరు, మతుకుమల్లి, పోట్లూరు, కొత్తలూరు గ్రామాల్లో పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ శాంతి భద్రతలు విఘాతం కలుగకుండా జాగ్రత్తలు వహిస్తున్నామన్నారు.

పాడిరైతు కుటుంబానికి బీమా చెక్కు అందజేత



యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని సంగండయిరీ సభ్యుడు దగ్గుబాటి యోగేశ్వరరావు ఈ ఏడాది జనవరి 24వ తేదీన మృతి చెందాడు. సహజ మరణం పొందిన పాడిరైతుకు బీమా పథకం వర్తించింది. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో రూ.50 వేల బీమా చెక్కును నరసరావుపేట సంగం డైరీ డైరెక్టర్ కట్టా జగన్‌మోహన్‌రావు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డైరీ మేనేజర్ తేలప్రోలు వీరేంద్ర కుమార్, తిమ్మాపురం పాలకేంద్రం అధ్యక్షుడు పావులూరి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు ఎలికా రాఘవులు, పిచ్చియ్య తదితరులు ఉన్నారు.

ఉత్తమ గ్రామపంచాయతీగా కారుమంచి



శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామపంచాయతీలో స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఉత్తమ పరిశుభ్రత గ్రామపంచాయతీగా ఎంపిక చేసినట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐటీసీ ప్రకటించిన అవార్డును పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు అందుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లావరపు విశ్రాంత, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ బొల్లా వెంకట సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నేతలు వుట్ల సుబ్బారావు, ఇడుపులపాటి హనుమంతరావు, బొల్లా పేరయ్యలు కార్యదర్శిని ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



నరసరావుపేట ఈస్ట్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈనెల 28న సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు విద్యార్థులకు సైన్స్ రంగంలో క్విజ్, వక్తృత్వం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. పోటీలలో జెడ్పీ హైస్కూల్ (తూబాడు) ప్రథమ, జడ్పీ హైస్కూల్ (శంకరభారతీపురం) ద్వితీయ, జడ్పీ హైస్కూల్ (పాలపాడు) తృతీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్, సైన్స్ ఉపాధ్యాయులు ఓ.సాంబయ్య, కె.చిట్టెమ్మ, బీవీహెచ్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో బాలల హక్కుల పరిరక్షణ

- అందుకే రాష్ట్ర విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారు
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): బాలల హక్కుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో పలు మార్పులు చేశారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ సీడీపీవో బి. అరుణ అధ్యక్షతన బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పలు రకాల పథకాలను ప్రవేశపెట్టి బాలల భవిష్యత్‌కు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బాటలు వేసిందన్నారు. అలాగే రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం 2006, జీవోఎంఎస్ 31,39, ఫోక్సో యాక్ట్, విద్యాహక్కు చట్టం 2009, బాల కార్మిక నిషేధ చట్టం 1986 తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అమ్మాయి వయస్సు 18 సంవత్సరాలు, అబ్బాయి వయస్సు 21 సంవత్సరాలు దాటిన తర్వాత మాత్రమే పెళ్లిళ్లు చేయాలని సూచించారు. బాల్యవివాహాలు జరిపినట్లయితే పరోక్షంగా, ప్రత్యక్షంగా బాల్యవివాహానికి హాజరైన వారికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణలో రాజీలేని సేవలే లక్ష్యంగా కమిషన్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈపూరు జెడ్పీటీసీ చౌడయ్య, ఈపూరు ఎంపీడీవో రంగ నాయకులు, ఎంఈవో జఫ్రుల్లా, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ సునీల్ చౌదరి, పద్మావతి, ఈపూరు ఏపీఎం రంగారెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

తూబాడులో జగనన్న ఆరోగ్య వైద్యశిబిరం

- 432 మందికి వైద్య పరీక్షలు
- ఉచితంగా మందులు పంపిణీ



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం



ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యురాలు

నాదెండ్ల: రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. తూబాడు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మంగళవారం సర్పంచ్ గోళ్ళమూడి కాశియ్య అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిశ్వేత, గైనకాలజిస్ట్ దత్తశ్రీ, జనరల్ మెడిసిన్ దుర్గశ్రీలు 432 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో విడతలవారీగా వైద్య క్యాంపులు నిర్వహించి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి 15 రోజులకోసారి ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానంలో మంచానికే పరిమితమైన వారికి ఇళ్లవద్ద వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు మందుల కిట్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, గణపవరం, నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దాట్ల విక్రమరాజు, టీజే రత్తయ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

నరసరావుపేట: మున్సిపల్ కమిషనర్ జి. రామ్మోహనరావు అనంతపురం జిల్లా తాడిపత్రికి బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాష్ట్రంలోని పలుచోట్ల మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రామ్మోహన్ అనంతపురంకు బదిలీకాగా ఆయన స్థానంలో వర్క్స్ అండ్ అకౌంట్స్ డిపార్టుమెంట్‌లో జిల్లా అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సి.రవిచంద్రారెడ్డిని డెప్యూటేషన్‌పై నియమించారు.

ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపాలి

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు
- జిల్లా ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ ట్రైనర్ ప్రకాశరావు



మాట్లాడుతున్న ప్రకాశరావు

శావల్యాపురం: ప్రకృతి వ్యవసాయం వైపు మహిళ సంఘాల సభ్యులు ఆసక్తి చూపాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ ట్రైనర్ దారా ప్రకాశరావు అన్నారు. మంగళవారం స్థానిక వైస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో స్వయం సహాయక మహిళా సభ్యులకు గ్రామసమాఖ్య మహిళా సభ్యులు వీవోఏలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ అంతర పంటలైనా ఆకుకూరలు, క్యారెట్, దుంపలు, బీట్‌రూట్, తదితర పంటలను గోమాత మూత్రం, పేడ ద్వారా ప్రకృతి వ్యవసాయ వైపు ఆసక్తి చూపాలన్నారు. నేటి వ్యవసాయం ఆహార పంటలన్నీ రసాయనిక ఎరువులు వినియోగించటం వలన మానవాళీ వివిధ రకాల అంతుచిక్కని వ్యాధుల బారిన పడి మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ పెట్టుబడులతో ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయన్నారు. ఈ సమావేశంలో ఏపీయం జి.వాసుబాబు, ఓర్చు లక్ష్మి దుర్గా, మండల సమాఖ్య అధ్యక్షురాలు గంజి నబోయిన నారాయణమ్మ, సీసీ ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలకు ప్రత్యామ్నాయమే మేలు

వ్యవసాయ సాగు విభాగం డీపీఎం కె.అమలకుమారి



చెంఘీజ్ ఖాన్ పేటలోని ప్రకృతి సేద్యమైన ఆకు కూరల సాగును పరిశీలిస్తున్న అమలకుమారి

యడ్లపాడు: ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటల రక్షణకు ప్రత్యామ్నాయం ప్రకృతి వ్యవసాయమేనని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విభాగం మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని ప్రకృతి విధానంతో సాగైన పంటల్ని పరిశీలించారు. సంగం గోపాలపురం సమీపంలో ప్రసన్నాంజనేయ స్వామి గుడి ఎదురుగా సాగు చేస్తున్న రైతు రామకృష్ణ పొలాన్ని సందర్శించి సాగు వివరాలు, ఎదురవుతున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రకృతి సాగు విధానంపై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రామకృష్ణ అనే రైతు ఇక్కడ ఎకరం భూమిలో ప్రకృతి సేద్యం చేస్తున్నాడన్నారు. అయితే ఆ భూమిలో 10 సెంట్లలో ప్రత్యేక బెడ్లను వేసి అందులో రకరకాల ఆకుకూరల సాగుకు శ్రీకారం చుట్టాడని తెలిపారు. ఈ సాగుకు రసాయనిక, పురుగు మందుల్ని కాకుండా పూర్తిగా ప్రకృతి విధానంతోనే బీజామృతం, ఘన జీవామృతం వంటి వాటిని వినియోగిస్తు, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి నాణ్యమైన ఉత్పత్తుల్ని సాధిస్తున్నాడని వివరించారు. బెడ్లపై ఒకభాగంలో సాగు చేసిన పంట పూర్తికాగానే తిరిగి అదే భాగంలో పంటమార్పు చేయడంతో దిగుబడి తగ్గే అవకాశం లేదన్నారు. ప్రకృతి విధానంతో సాగు చేసిన పంటలు ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఇస్తాయన్నారు.

కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

ఎంఈవో–1.2 ఎంవీ నాగరత్నం, ఎం అరుణకుమారి



విద్యావనరుల కేంద్రం వద్ద ఉచిత విద్య వివరాల ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఎంఈవోలు

యడ్లపాడు: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అభ్యసించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ఎంఈవో –1,2 ఎంవీ నాగరత్నం, ఎం అరుణకుమారి తెలిపారు. మంగళవారం ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్య పొందే వివరాలను వారు వెల్లడించారు. 2019 ఏపీ విద్యా హక్కు చట్ట సెక్షన్ 12(1)సి ప్రకారం దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాల పిల్లలు ఇందుకు అర్హులన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి ప్రవేశం పొందగోరే విద్యార్థులు 2017 ఏప్రిల్ 2–2018 మే 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు 10 శాతం, బీసీలు 6శాతం, విభిన్న ప్రతిభావంతులు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఐబీ, సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్ బోధించే స్కూళ్లను ఎంపిక చేసుకోవచ్చన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు సమాచారం అందించామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు విద్యార్థి ఆధార్, కుల, ఆదాయ, రేషన్‌కార్డులతో పాటు పాస్‌పోర్ట్‌సైజు ఫోటోలతో గ్రామసచివాలయం, మండల విద్యావనరుల కేంద్రం, నెట్‌సెంటర్లలో మార్చి 25లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నం: 14417కు సంప్రదించాలన్నారు.

వైభవంగా వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆలయం వద్ద భక్తుల సందడి

నాదెండ్ల: గణపవరం–కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న చారిత్రాత్మక ఆలయమైన శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. తొలిరోజు సోమవారం స్వామివార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి పరిమి లక్ష్మీనారాయణ శాస్త్రి బృందం ఆధ్వర్యంలో స్వామివారికి గోత్రనామ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి సుప్రభాత సేవ, విశేష పూజలు నిర్వహించారు. భక్తుల గోత్రనామ పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఆకుపూజ నిర్వహించారు. నాదెండ్ల గ్రామానికి చెందిన భజన బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించారు. నరసరావుపేటకు చెందిన ఆధ్యాత్మిక సేవా ప్రవంతి అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భారీ అన్నదాన కార్యక్రమానికి మాచవరం, నరసరావుపేట, గణపవరం, చిలకలూరిపేట, అల్లూరు వారిపాలెం నుంచి వచ్చిన సేవకులు సేవలందించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం భక్తులతో పోటెత్తింది. రాత్రి గణపవరం గ్రామానికి చెందిన భక్తులు లలితా గీత పారాయణం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాట్రు శ్రీనివాసరావు, ఆదిపూడి మల్లిఖార్జునరావు, కమిటీ సభ్యులు శివ రామకృష్ణ, ఎ.సత్యనారాయణగుప్త, అనిశెట్టి సుబ్బారావు, కృష్ణారావు, నాగేశ్వరాచారి, మస్తాన్ బాబు, మున్నంగి శేషయ్య, శ్రీపతి, నన్నపనేని శ్రీనివాసరావు, కాట్రు శ్రీనివాసరావు, కెల్లంపల్లి వెంకయ్య పర్యవేక్షించారు.

సైకిల్ దిగేసి.. ఫ్యాను కింద సేదదీరి..!

పోట్లూరులో టీడీపీని వీడిన 40 కుటుంబాలు



పార్టీ కండువాలు కప్పి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలోని బీసీ కాలనీకు చెందిన 40 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి వచ్చినట్లు మండల వైఎస్సార్ కన్వీనర్ భీమని అంకారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వినుకొండ పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదగా పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు నచ్చడంతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో పార్టీలోకి చేరటం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టరు ఒంగోలు చిన ఆంజనేయులు గ్రామపార్టీ అధ్యక్షులు వల్లూరి శ్రీనివాసరావు, బీసీ నాయకులు తమ్మిశెట్టి చిన అంకారావు, బండారు అంజయ్య, రామయ్య, కోటినారాయణ, శివ, నాగుల్ మీరా, వెంకట్రావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, అబ్బూరి అయ్యన్న, తూమాటి రవి, కామని శ్రీను, అబ్బూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బొల్లాపల్లి దాహార్తి తీరుస్తున్న జననీ

- బొల్లాపల్లి మండలంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- దృష్టిసారించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



జననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గండి గనుమలలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



రేమిడిచర్లలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా నీటి సరఫరా చేస్తున్న ట్యాంకర్లు

బొల్లాపల్లి: వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో తాగునీటి కొరత ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి ముందస్తుగా జననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సొంత నిధులతో దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముందుకు వచ్చారు. ఆయా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా మండలంలో నీటి సరఫరా చేస్తున్నారు. గతంలో మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య నెలకొన్నప్పటికీ పట్టించుకున్న దాఖలాల్లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో ఈ ఏడాదే మండలంలో కొంత మేర నీటి సమస్య ఏర్పడింది. ఈ ఏడాది వర్షాభావంతో భూగర్భ జలాలు అడుగంటడంతో, కొన్ని గ్రామాల్లో బోర్లులో నీరు ఇంకిపోవడంతో, ఆయా గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నీటి సమస్యకు పరిష్కారంగా స్వచ్ఛందంగా సొంత ట్యాంకర్ల ద్వారా ఇప్పటికే కొన్ని గ్రామాలో నీటి సరఫరా జరుగుతోంది. గ్రామీణ నీటి సరఫరా విభాగం మండలంలో నీటి సమస్య ఉన్న రేమిడిచర్ల, గుమ్మనంపాడు, అయ్యన్నపాలెం, గండిగనుమల, దొమలగుండం, తండా, చక్రాయపాలెం, మన్నేపల్లి తండా, మేకలదిన్నె, గంగుపల్లి తండా, గంగుపల్లి, కంద్రిక, వంటి నీటి కొరత ఉన్న గ్రామాలను ఆ శాఖాధికారులు గుర్తించారు. ఎమ్మెల్యే బొల్లా ఆధ్వర్యంలో ఇప్పటికే గండిగనుమల, చక్రాయపాలెం, అయ్యన్నపాలెం, మన్నేపల్లి తండాల్లో స్వంతంగా ట్యాంకర్ల ఏర్పాటుతో నీటి సరఫరా చేస్తున్నారు. అయితే గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా రేమిడిచర్ల, దొమలగుండం, తండా తదితర గ్రామాల్లో ట్యాంకర్లు ఏర్పాటు చేశామని ఆ శాఖ ఏఈ ఎం. ఆకాష్ నాయక్ తెలిపారు. మిగిలిన గ్రామాల్లో సైతం నీటి సమస్య తీవ్రతను గుర్తించి త్వరలో ఆ గ్రామాలకు కూడా ట్యాంకర్లు ద్వారా సరఫరాకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

ప్రజల దాహార్తిని తీరుస్తాం



మండల ప్రజల దాహార్తిని తీర్చటానికి సొంత నిధులు వెచ్చించి జననీ ఫౌండేషన్ ద్వారా ట్యాంకర్లతో నీళ్లు సరఫరా చేస్తున్నాం. గత పాలకుల తప్పిదాల వల్ల నేడు నీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. వరికెపూడిశెల ఎత్తిపోతల నిర్మాణంతో మండల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. గత పాలకులు పరిష్కరించలేని సమస్యలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసి చూపించింది. తాగు, సాగునీటి సమస్య లేకుండా మండల ప్రజల ఆకాంక్షను నేరవేర్చడటమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యం. పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న మాజీ ఎమ్మెల్యే జీ.వి చేసిందేమీ లేదు.. సమస్యను మరింత జఠిలం చేయడం తప్ప. భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రస్తుతం మండలంలో తాత్కాలిక చర్యలు చేపట్టాం. నీటి కొరత లేకుండా చూస్తాం.

– బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్యే


కొంత సమస్య తీరింది



తండాలో నీళ్ల సమస్య ఉంది. ప్రస్తుతం మా తండాలో మూడు ట్యాంకర్లతో రోజు నీళ్లు సరఫరా చేస్తున్నారు. తండాలో మరిన్ని ట్యాంకర్లు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం కొరత కొంత మేర తీరింది. త్వరలో పెంచి పూర్తి సమస్య లేకుండా చుడాలి. గతంలో నీళ్ల కోసం ఇబ్బందులు పడ్డాం.

–రామావతు పార్వతి బాయి, గండిగనుమల

కొండవీడు గిరిదుర్గంపై పూజలు



ఉత్సవాలలో పాల్గొన్న ఋత్విక బృందం



అంకురార్పణ చేస్తున్న దంపతులు

యడ్లపాడు: మండలంలోని కొండవీడు, కొత్తపాలెం గ్రామాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన శోభాయాత్ర వైభవంగా జరిగింది. కొండవీడు గిరిదుర్గంపై పునఃనిర్మితమైన పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. లక్ష్మీనరసింహస్వామి, గరుడ ఆళ్వార్ విగ్రహాలను ఈనెల 29వ తేదీన కొండపై ఉన్న ఆలయంలో ప్రతిష్ఠ చేయనున్నారు. ఇందులో భాగంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, మేదిని ఆరాధన, అంకురార్పణ పూజా క్రతువుల్ని పండితులు నిర్వహించారు. యాగశాలలో ప్రతిష్ఠా పూజలకు కొండవీడు అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె శివారెడ్డి, నాగమల్లేశ్వరీ దంపతులు కూర్చొన్నారు. కార్యక్రమాలను ఈవో శివయ్య పర్యవేక్షించారు.

బీమా చెక్కు అందజేత

యడ్లపాడు:మండలంలోని తిమ్మాపురంలోని సంగండైరీ సభ్యుడు దగ్గుబాటి యోగేశ్వరరావు ఈ ఏడాది జనవరి 24వ తేదీన మృతి చెందాడు. సహజ మరణం పొందిన పాడిరైతుకు బీమా పథకం వర్తించింది. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో రూ.50 వేల బీమా చెక్కును నరసరావుపేట సంగం డైరీ డైరెక్టర్ కట్టా జగన్‌మోహన్‌రావు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తేలప్రోలు వీరేంద్ర కుమార్, పావులూరి శ్రీనివాసరావు, ఎలికా రాఘవులు, పిచ్చియ్య తదితరులు ఉన్నారు.